## 1,947కే విమాన టికెట్

**ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్**

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రీడం సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,947గా నిర్ణయించింది. ఈ నెల 5 లోపు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 30లోగా ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొంది.

## లాభాల్లో మెడ్‌ప్లస్

హైదరాబాద్, ఆగస్టు 2: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఔషధ విక్రయ సంస్థ మెడ్‌ప్లస్ హెల్త్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.14.36 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 16 శాతం ఎగబాకి రూ.1,489 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది.

## ఇంటింటా ఇన్నోవేటర్ గడువు పొడిగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఇంటింటా ఇన్నోవేటర్-2024కు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగిస్తున్నట్టు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రకటించింది. ఆవిష్కర్తలు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 10 వరకు అవకాశం ఉందని పేర్కొంది. ఆవిష్కరణలను 9100678543 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని సూచించారు.

## 6న ఏఐపై వర్క్‌షాపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో కలిసి ఈ నెల 6న వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు టీ హబ్ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వాడుకలోకి వచ్చిన ఏఐ టూల్స్ తరహాలో పరిశ్రమల అవసరాల కోసం ఉత్పాదక (జనరేటివ్)ఏఐపై ఆవిష్కర్తలు, స్టార్టప్ నిర్వాహకులు సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా అమెజాన్ వెబ్ సర్వీసు (ఎడబ్ల్యుఎస్) సహకారంతో ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు టీ హబ్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని టీ హబ్ ప్రతినిధి తెలిపారు.

# 4.5 లక్షల కోట్లు ఔట్

### స్టాక్ మార్కెట్ నష్టాలతో ఒక్కరోజే భారీగా ఆవిరైన సంపద

**రికార్డు గరిష్ఠాల నుంచి సూచీలు వెనుకకు ● సెన్సెక్స్ 886, నిఫ్టీ 293 పాయింట్లు పతనం**




ముంబై, ఆగస్టు 2: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్ పడింది. శుక్రవారం మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా నమోదు కావడం అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లకు రుచించలేదు. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడింది. ఆల్‌టైమ్ హైల్లో సూచీలు ఉండటంతోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణకు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే భారీ నష్టాలు వాటిల్లాయి. ఫలితంగా 5 రోజుల లాభాలకు తెరపడినట్టైంది. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 885.60 పాయింట్లు లేదా 1.08 శాతం క్షీణించి 80,981.95 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 998.64 పాయింట్లు పడిపోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 293.20 పాయింట్లు లేదా 1.17 శాతం పతనమై 24,717.70 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలోనైతే గరిష్ఠంగా 324.05 పాయింట్లు నష్టపోయింది.

**రంగాలవారీగా..**

రియల్టీ షేర్లు అత్యధికంగా 3.56 శాతం నష్టపోయాయి. మెటల్ 3 శాతం, ఆటో 2.97 శాతం, ఐటీ 2.05 శాతం, కమోడిటీస్ 1.83 శాతం, టెక్నాలజీ 1.79 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.70 శాతం చొప్పున క్షీణించాయి. ఇక మారుతీ సుజుకీ, టాటా మోటర్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఎల్అండ్‌టీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేక నష్టాలను మూటగట్టుకున్నాయి. జూలైలో పడిపోయిన వాహన విక్రయాలతో ఆటో కంపెనీల షేర్లు, ఇన్ఫోసిస్‌కు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నోటీసుల కలకలంతో ఐటీ సంస్థల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.58 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి.

**గ్లోబల్ మార్కెట్లలో..**

అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులను పరిశీలిస్తే.. ప్రధాన ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఐరోపాలోని కీలక దేశాల స్టాక్ మార్కెట్ల పరిస్థితీ ఇలాగే ఉన్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నలా భావించే అమెరికాలో మరోమారు ఆర్థిక మాంద్యం ఛాయలు అలుముకుంటున్నాయా? అన్న అంచనాల నడుమ మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఈ పరిణామం భారత్‌సహా అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్లను కుదిపేసినట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. జూలైలో ఐఎస్ఎం తయారీ సూచీ 46.6కు దిగజారింది. దీంతో మాంద్యం భయాలు మళ్లీ నెలకొన్నాయని అంటున్నారు. అలాగే ఇజ్రాయెల్-హమాస్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలూ నష్టాలకు దారితీశాయని వారు చెప్తున్నారు.

### మార్కెట్ విలువ డౌన్

*స్టాక్ మార్కెట్ల భారీ నష్టాల నడుమ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో కరిగిపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,46,003.7 కోట్లు తగ్గి రూ.4,57,16,946.13 కోట్ల (5.46 ట్రిలియన్ డాలర్ల)కు పరిమితమైంది. బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 1.08 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం, స్మాల్‌క్యాప్ 0.58 శాతం చొప్పున పడిపోయాయి. ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో కదలాడగా.. సమయం గడుస్తున్నకొద్దీ మరింత తీవ్రంగా నేలచూపులు చూశాయి.*



*మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహీంద్రా గ్రూపు పెట్టుబడులపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆనంద్ మహీంద్రా అంగీకరించారు.*

## అమెరికాను భారత్ అందుకోలేదు

- **నాల్గోవంతు తలసరి ఆదాయాన్ని చేరాలన్నా 75 ఏండ్లు పట్టొచ్చు**
- **ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక**

న్యూఢిల్లీ, ఆగస్టు 2: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకే చోదక శక్తి, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధిరేటును సాధిస్తున్న దేశం అంటూ భారత్‌ను కీర్తిస్తున్న వేళ.. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఓ నివేదిక అందులో నిజమెంత? అన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. రాబోయే కొన్ని దశాబ్దాల్లో భారత్‌సహా 100కుపైగా దేశాలు.. అధిక ఆదాయ దేశాలుగా ఎదిగేందుకు ఎన్నో తీవ్ర అడ్డంకులను ఎదుర్కోవాల్సి రావచ్చని వరల్డ్ బ్యాంక్ హెచ్చరించింది. ఈ క్రమంలోనే అమెరికా తలసరి ఆదాయంలో ఒక్క త్రైమాసికానికి సమానమైన ఆదాయాన్ని చేరాలన్నా.. భారత్‌కు దాదాపు 75 ఏండ్లు పట్టవచ్చని అంచనా వేసింది. ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ప్రపంచ అభివృద్ధి నివేదిక 2024: ది మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్ పేరిట తెచ్చిన రిపోర్టులో అమెరికా తలసరి ఆదాయంలో నాల్గోవంతును చేరడానికి చైనాకైతే 10 ఏండ్లు పడుతుందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. ఇండోనేషియాకు 70 ఏండ్లు పట్టవచ్చన్నది.

**కటిక దారిద్ర్యం**

గత ఏడాది చివరికల్లా భారత్‌సహా 108 దేశాలను మిడిల్ ఇన్‌కమ్ దేశాలుగా వర్గీకరించారు. ఒక్కోదాని వార్షిక జీడీపీ తలసరి ఆదాయం 1,136 డాలర్ల నుంచి 13,845 డాలర్ల మధ్య ఉన్నది. ఈ దేశాల్లో 600 కోట్ల జనాభా ఉండగా.. ఇది ప్రపంచ జనాభాలో 75 శాతానికి సమానం. అలాగే ఈ దేశాల్లో ప్రతీ ముగ్గురిలో ఇద్దరు కటిక దారిద్ర్యంలో మగ్గిపోతుండటం గమనార్హం. ఇదిలావుంటే 1990 నుంచి ఇప్పటిదాకా కేవలం 34 దేశాలే మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థల నుంచి అధిక ఆదాయ ఆర్థిక వ్యవస్థలకు ఎదిగాయని ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రధాన ఆర్థికవేత్త గిల్ తెలిపారు.

# రికార్డుస్థాయికి ఐటీ రిటర్నులు

***7.28 కోట్ల మంది దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ వెల్లడి***




న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారు. 2024-25 అసెస్‌మెంట్ ఏడాదికిగాను 7.28 కోట్ల మంది రిటర్నులు దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ తాజాగా వెల్లడించింది. 2023-24 ఏడాది దాఖలు చేసిన 6.77 కోట్ల కంటే వీరి సంఖ్య 7.5 శాతం అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు జూలై 31 చివరి రోజు 70 లక్షల మంది దాఖలు చేసినట్లు తెలిపింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసిన 7.28 కోట్ల మందిలో నూతన పన్ను విధానాన్ని ఎంచుకున్నవారు 5.27 కోట్ల మంది కాగా, పాత పన్నుల విధానాన్ని కొనసాగించిన వారు 2.01 కోట్ల మంది. పన్ను చెల్లింపుదారుల ప్రాధాన్యతలు అంతకంతకు పెరుగుతున్నాయి. . ఈసారి దాఖలు చేసిన వారిలో 72 శాతం మంది ఈ పన్ను విధానాన్ని ఎంచుకోగా, 28 శాతం మంది పాత పన్నుల విధానంలోనే దాఖలు చేశారు. అలాగే కొత్తగా దాఖలు చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నట్లు పేర్కొంది. దాఖలు చేసిన వారిలో ఐటీఆర్-1 కింద 45.77 శాతం(3.34 కోట్లు), ఐటీఆర్-2 కింద 14.93 శాతం(1.09 కోట్లు), ఐటీఆర్-3 కింద 12.5 శాతం(91.10 లక్షలు), ఐటీఆర్-4 కింద 25.77 శాతం(1.88 కోట్లు), ఐటీఆర్-5 నుంచి ఐటీఆర్-7 కింద 1.03 శాతం(7.48లక్షలు) కేటగిరిల కింద దాఖలు చేశారు. వీరిలో 43.82 శాతం మంది ఆన్‌లైన్‌లో ఐటీఆర్ దాఖలు చేయగా, మిగతావారు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

**పన్ను ఎగవేతలు కూడా..**

పన్ను చెల్లింపుదారులు పెరిగినట్లే పన్ను ఎగవేతదారులు కూడా రికార్డు స్థాయిలో పెరుగుతున్నారు. గడిచిన పదేండ్లకాలంలో పన్ను ఎగవేతదారులు వెయ్యి రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.9.08 లక్షల కోట్ల పన్ను చెల్లింపులకు సంబంధించి నోటీసులు జారీ అయ్యాయి. 2013014 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.80 వేల కోట్లుగా ఉన్నది.

### టార్గెట్ 'ఇన్ఫోసిస్' మూర్తి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ కంపెనీ రూ.32,403 కోట్ల జీఎస్టీ ఎగవేతకు సంబంధించి కర్ణాటక స్టేట్ జీఎస్టీ అధికారులు ముందస్తు షోకాజ్ నోటీసులు పంపడంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు వారంలో 70 గంటలు పనిచేయాలన్న నారాయణ మూర్తి కామెంట్లను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఇన్ఫోసిస్ జరిమానా కట్టడానికి ఎక్కువ గంటలు పనిచేయాల్సిందేనని పోస్టులు పెడుతున్నారు. కాగా ఎగవేతకు సంబంధించిన నోటీసులను వెనక్కి తీసుకొంటున్నట్టు జీఎస్టీ అధికారులు తాజాగా వెల్లడించడం గమనార్హం.

## జియోథర్మల్ క్షేత్రంగా మణుగూరు!

### అన్వేషణ, అభివృద్ధిపై త్రైపాక్షిక ఒప్పందం




హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): భూతాపం ఆధారంగా విద్యుదుత్పత్తికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరును జియోథర్మల్ క్షేత్రంగా అభివృద్ధి చేయనున్నారు. అక్కడ 122 మోగావాట్ల జియోథర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మూడు సంస్థలు సిద్ధమవుతున్నాయి. మణుగూరు సమీపంలోని పగిడేరు వద్ద ఏర్పాటు చేయడానికి శుక్రవారం సింగరేణి, ఓఎన్‌జీసీ, తెలంగాణ రెడ్కోల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. దీనికి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుష్మారావత్, రెడ్కో జీఎం సత్యవరప్రసాద్‌లు హాజరయ్యారు. ఇప్పటికే 20 కిలోవాట్ల విద్యుదుత్పత్తికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమవ్వగా, 122 మెగావాట్లకు వీలుందని ఓఎన్‌జీసీ నివేదిక వెల్లడించింది. మరికొన్ని పరిశోధనల్లో 3,500 మోగావాట్ల వరకు జియోథర్మల్ విద్యుదుత్పత్తికి అవకాశమున్నట్లుగా తేలింది.

**రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి..**

రోజుకు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు.



*గట్లకానిపర్తిలో ఇంటింటా సర్వే చేస్తున్న డాక్టర్, వైద్య బృందం*

## గట్లకానిపర్తిలో ఇంటింటా సర్వే

*డెంగీతో గర్భిణి మృతిపై విచారణ*

శాయంపేట, ఆగస్టు 2 : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన బొమ్మ కంటి శిరీష డెంగీ జ్వరంతో మృతి చెందిన విషయం తెలిసిందే. తనతో పాటు కడుపులోని ఇద్దరు కవల పిల్లలు కూడా మృత్యువాత పడడం కలకలం రేపింది. ఈ క్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ అపర్ణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సూపర్‌వైజర్, ఆశ వర్కర్లు గ్రామంలోని 80 ఇండ్లలో 470 మందిని కలిసి సర్వే చేశారు. అయితే కేవలం ఒక్కరికే జ్వరం ఉండడంతో అతడి రక్త నమూనాలు సేకరించినట్లు వైద్యాధికారి సాయికృష్ణ తెలిపారు. జ్వరాలు లేవని అయినా దోమల నివారణకు మందును స్ప్రే చేయిస్తామని, గ్రామంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించి అందరికీ పరీక్షలు నిర్వహిస్తామని వైద్యాధికారి చెప్పారు. అలాగే శిరీష డెంగీతో మృతి చెందిన హనుమకొండలోని ఆస్పత్రికి వెళ్లి విచారణ జరిపారు. అయితే ర్యాపిడ్ టెస్టులో డెంగీ లక్షణాలు ఉన్నట్లు అనుమానించారని, ఎలీషా టెస్టుతోనే డెంగీ పాజిటివ్ తెలుస్తుందని, ఈ పరీక్ష శిరీషకు చేయించలేదని చెప్పారు. విచారణ నివేదికను కలెక్టర్‌తోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిపారు.

## కర్ర కోసే మిషన్ తగిలి వ్యక్తి మృతి



పైడయ్య(ఫైల్)

చిట్యాల, ఆగస్టు 2 : ప్రమాదవశాత్తు కర్రకోత మిషన్ చాతికి తగిలి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని గోపాలపూర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సాదవెల్లి పైడయ్య(65) బోగం భద్రయ్య ఇంటి వద్ద ఉన్న చెట్టును కోసేందుకు కూలీగా వెళ్లాడు. కోసిన అనంతరం కొమ్మలను విడిపిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మిషన్ పైడయ్య చాతికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ అక్కడికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

# అధ్యాపకులు లేక.. ఆదరణకు నోచుకోక



వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాల

*సమస్యల వలయంలో సీకేఎం కళాశాల*

- **ఒక్క పోస్టూ మంజూరు కాని వైనం**
- **గెస్ట్ లెక్చరర్లతో కొనసాగుతున్న కళాశాల**
- **సరైన ఫ్యాకల్టీ లేక తగ్గుతున్న విద్యార్థులు**
- **నామ్‌కే వాస్తేగా మారిన పీజీ చదువులు**

పోచమ్మమైదాన్, ఆగస్టు 2 : ఎందరో మేధావులను తయారు చేసిన చందా కాంతయ్య మెమోరియల్ (సీకేఎం) ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నేడు విద్యార్థుల ఆదరణను కోల్పోయింది. గత సంవత్సరం ఆగస్టు 1న అప్పటి బీఆర్ఎస్ సర్కారు ఎయిడెడ్‌గా ఉన్న ఈ కళాశాలను ప్రభుత్వ పరం చేసింది. ఇక్కడ పనిచేస్తున్న లెక్చరర్లను రెగ్యులర్ చేసి వివిధ కళాశాలల్లో పోస్టింగ్ ఇచ్చింది. ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకొని ఏడాదైనప్పటికీ ఇప్పటి వరకు కళాశాలలో ఒక్కరిని కూడా నియమించకపోవడంతో గెస్ట్ లెక్చరర్లతోనే నడపాల్సి వస్తున్నది. టీచింగ్ స్టాఫ్ సరిగా లేక యూజీ, పీజీ చదువులు నామమాత్రంగా సాగుతుండటంతో దోస్త్ ద్వారా విద్యార్థులు ఈ కళాశాలలో చేరడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఎలాంటి మార్పులు లేకపోవడంతో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడానికి ముందుకు రావడం లేదని తెలుస్తున్నది.

***1968లో కళాశాల ఏర్పాటు***

వరంగల్ దేశాయిపేటలో సీకేఎం కళాశాలను 1968లో ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి దినదినాభివృద్ధి చెందుతూ వేలాది మంది విద్యార్థులను కళాశాల తీర్చిదిద్దింది. అయితే మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కళాశాల నడపడం భారమైంది. కొంతమంది ఎయిడెడ్‌తో పాటు అన్ ఎయిడెడ్ సిబ్బందితో కళాశాల నిర్వాహణ తలకు మించిన భారం కాగా, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లేకపోవడం సమస్యగా మారింది. ఇదే క్రమంలో యాజమాన్యం కూడా కళాశాలను (భవన సముదాయంతో పాటు) ప్రభుత్వపరం చేయడానికి ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సర్కారు కళాశాలను ప్రభుత్వంలోకి తీసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతేడాది జూన్ 26న 44 జీవో ప్రకారం ఎయిడెడ్ సిబ్బందిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతరం ఆగస్టు 1న సీకేఎం కళాశాలను ప్రభుత్వపరం చేయడానికి అడుగుపడింది. ఈ మేరకు 44 జీవోను సవరణ చేస్తూ 77 జీవో ప్రకారం అక్టోబర్ 9న అన్ ఎయిడెడ్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో మొత్తం 64 మందికి వివిధ కళాశాలల్లో పోస్టింగ్ ఇచ్చారు. తదుపరి ఇక్కడి అవసరాల మేరకు 24 మంది అధ్యాపకులు సీకేఎం కళాశాలకు ఓడీపై వచ్చి విద్యాబోధన కొనసాగించారు. ఈ ఏడాది మే 3న వారు తిరిగి తమ మాతృ కళాశాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం కళాశాలలో ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ మాత్రమే రెగ్యులర్ పోస్టులో ఉన్నారు.

***గెస్ట్ లెక్చరర్లతోనే..***

కళాశాలలో రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల పది మంది గెస్ట్ లెక్చరర్లను నియమించారు. యూజీలో బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీకాం కంప్యూటర్, బీఏ డిపార్ట్‌మెంట్లకు ఒకరు చొప్పున పనిచేస్తున్నారు. అలాగే పీజీలో ఎంకాం, ఎంఏలో ఒకరు ఎంఎస్సీ కెమిస్ట్రీలో ఇద్దరు, బాటనీలో ఒకరు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే ఇద్దరు ఓడీపై, ఒకరు రెగ్యులర్ ఉంటూ విద్యాబోధన కొనసాగిస్తున్నారు. అయితే ఇంగ్లిష్, హిందీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు అధ్యాపకుల నియామకం జరుగలేదు.

***తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య***

కళాశాలలో ఫ్యాకల్టీతో పాటు సరైన సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. యూజీలో భాగమైన బీఎస్సీ బీజడ్సీ, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీకాం కంప్యూటర్, బీఏలో 60 సీట్ల చొప్పున భర్తీ చేసుకునే అవకాశం ఉన్నా చాలావరకు భర్తీ కావడం లేదు. ఇక పీజీలో ఎంకాం, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బాటనీ, ఎంఏ తెలుగులో 40 సీట్ల చొప్పున భర్తీ చేసుకునే అవకాశం ఉన్నా సగం వరకు కూడా భర్తీకి నోచుకోవడం లేదు. ఈ కళాశాలలో యూజీలోని అన్ని విభాగాల్లో కలిపి 1800 సీట్లుండగా, గతేడాది కేవలం 530 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. పీజీలో 280 సీట్లకు దాదాపు 100 మంది అడ్మిషన్లు పొందారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా యూజీ, పీజీలో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని అధ్యాపకులే చెబుతున్నారు. అధ్యాపకుల కొరత, సౌకర్యాల లేమి, బాయ్స్‌కు హాస్టల్ వసతి లేకపోవడం సమస్యగా ఉన్నట్లు వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ కళాశాలకు పోస్టులు మంజూరు చేసి, సరిపడా ఫ్యాకల్టీని నియమించడంతో పాటు సదుపాయాలను మెరుగుపర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.



*భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు*

## ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

- **భగత్‌సింగ్ కాలనీవాసులకు మౌలిక వసతులు కల్పించాలి**
- **సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్**
- **భూపాలపల్లి మున్సిపాలిటీ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా**

కృష్ణకాలనీ, ఆగస్టు 2 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు ఆవరణలో రెండేళ్లుగా గుడిసెలు వేసుకొని ఉంటున్న గుడిసె వాసులకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కమిటీ పిలుపు మేరకు భూపాలపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు, గుడిసెవాసులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సుమారు వెయ్యి మందితో సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గుడిసె వాసులందరికీ ఇండ్ల పట్టాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కలెక్టర్ రాహుల్ శర్మ ఈ విషయంపై వెంటనే స్పందించాలని కోరారు. కాగా, మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా సందర్భంగా పోలీసులు, సీపీఐ నాయకులకు మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేముల శ్రీకాంత్, పీక రవికాంత్, మరాఠీ కాంతారావు, ఆరబోయిన వెంకటేశ్, యాకూబ్ పాషా, పొన్నగంటి లావణ్య, గోలి లావణ్య, వనిత, సంధ్య, రజిత, శ్రీలత, రాజేశ్వరి, గడ్డం స్వరూప, వెయ్యిమంది గుడిసెవాసులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో డెంగీ ఫీవర్

- **రోగులతో ఏటూరునాగారం దవాఖాన కిటకిట**
- **రోజుకు ఓపీ 350పైనే..**

ఏటూరునాగారం, ఆగస్టు 2 : ఏజెన్సీలో జ్వరాలు విజృంభిస్తుండడంతో ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాలకు జ్వర పీడితుల తాకిడి పెరిగింది. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, కన్నాయిగూడెం మండలాల నుంచి రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలతో పాటు జలుబు, దగ్గు సమస్యలున్న వారు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో జ్వరాలు రావడంతో వారంతా ఇక్కడికే సామాజిక వైద్యశాలకు తరలివస్తుండడంతో జనరల్ వార్డులోని బెడ్స్ నిండిపోవడంతో అత్యవసర చికిత్స అందించే గదుల్లోని బెడ్స్ కూడా జ్వరం కేసులకు వినియోగించుకుంటున్నారు. ఓపీ కూడా పెరిగింది. రోజుకు సుమారు 350 మందికి పైగా రోగులు వస్తుండగా ఇందులో ఎక్కువగా ఫీవర్ కేసులో ఎక్కువగా ఉంటున్నాయని వైద్య సిబ్బంది చెబుతున్నారు.



*జనరల్ వార్డులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి,(ఇన్‌సెట్)చికిత్స పొందుతున్న బాలుడు*

# పత్తికి ఆపతి

- **ఎడతెరిపి లేని వర్షాలకు ఎర్రబడ్డ పంట**
- **వందలాది ఎకరాల్లో దెబ్బతిని నష్టం**
- **మక్కజొన్నదీ అదే పరిస్థితి..**
- **ఆందోళనలో అన్నదాతలు**

శాయంపేట, జూలై 30 : పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వాన పత్తి పంటను దెబ్బ తీసింది. వర్షానికి నీరంతా చేనులో నిలువడంతో జాలుపట్టి వందలాది ఎకరాల్లో పత్తి ఎర్ర బడింది. మక్కజొన్న పంట పరిస్థితీ అలాగే ఉంది. వేలాది రూపాయల పెట్టుబడితో సాగు చేసిన పంటలు ఆదిలోనే దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండల పరిధిలో తొమ్మిది వేలకుపైగా ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. రెండు వేలకుపైగా ఎకరాల్లో మక్కజొన్న, అలాగే పసుపు పంటను వేశారు. శాయంపేట, ఆరెపల్లి, పత్తిపాక, ప్రగతి సింగారం, నేరేడుపల్లి, మాందారిపేట, సూరంపేట, గట్లకానిపర్తి, కొప్పుల, వసంతాపూర్ తదితర గ్రామాల్లో పత్తికి తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తిపై ఎకరాకు రూ. 30 వేలకు పైగా ఖర్చు పెట్టామని, వానలతో మళ్లీ ఇరవై రోజులు వెనక్కి పోయిందని ఆరెపల్లి రైతు దుర్నాల రాజు మంగళవారం తెలిపారు. ఇప్పటికైనా వరుణుడు గెరువిస్తే కొన్ని మందులు పిచికారీ చేసి పత్తి పంటను కాపాడుకోవాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు. పంట ఎర్రబడడంతో అదనంగా మరో రూ. 20 వేల పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా పత్తి దిగుబడి సరిగా రాకపోవడంతో ఈసారి పలువురు రైతులు మక్కజొన్న వైపు మళ్లారు. ఈ సీజన్‌లో నష్టాల నుంచి గట్టెక్కాలనుకున్న రైతులను ప్రకృతి పగబట్టడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అలాగే ఇప్పటికే మక్కజొన్న ఎర్రబడగా, మరికొన్ని రోజులు వానలు పడితే పంట చేతికి రాదని రైతులు చెబుతున్నారు. పురుగు మందులు కొట్టినా చేతికి వచ్చే పరిస్థితి ఉండదని వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు తగు సూచనలు చేసి అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.



*తెరిపి లేకుండా కురిసిన వానలో ఎర్రబడ్డ పత్తి పంట*



*పత్తిపాక శివారులో వానలకు దెబ్బతిన్న పత్తి*